క్లుప్తంగా

కాలువలో పూడికతీత పనులు ప్రారంభం

రుద్రూర్: కోటగిరి మండలం యాద్గార్‌పూర్ శివారులో కాలువ పూడికతీత పనులను ఆదివారం చేపట్టారు. కాలువలో పూడిక పేరుకుపోయి ఆయకట్టు చివరి ప్రాంతానికి సాగు నీరు అందడం లేదని రైతులు మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఇచ్చిన హామీ మేరకు ఆదివారం పూడిక పనులు ప్రారంభించినట్లు స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్, మాజీ జడ్పీటీసీ పుప్పాల శంకర్, నాయకులు వాహీద్ హుస్సేన్, దాదు, మున్వార్, కృష్ణ, మహేశ్ గౌడ్, మైతాబ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

స్వప్రయోజనాల కోసమే పార్టీల మార్పు

వర్ని: కొందరు బీఆర్‌ఎస్ నాయకులు తమ స్వప్రయోజనాల కోసమే పార్టీ మారుతున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఖల్లాల్ గిరి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా పార్టీలో ఉండి వివిధ పదవులు అనుభవించి స్వప్రయోజనాలు పొందిన నాయకులు అధికారం కోల్పోగానే వారి స్వార్థం కోసం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఆరోపించారు. ఇలాంటి నాయకులు పార్టీలో ఉన్నా లేకున్నా ఒకటే అని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు గోపాల్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి వర్ని ఎంపీపీ సస్పెన్షన్

వర్ని: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, ఆమె భర్త వీర్రాజును బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో ఉండి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

కార్మికుల సమస్యలపై పోరాటం

రుద్రూర్: కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పలువురు ఆటో కార్మికులు సీపీఎం సీనియర్ నాయకుడు గంగాధరప్ప సమక్షంలో సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ రఫీక్, జలీల్, వినోద్, సద్దాం, లతీఫ్, శివ, సతీశ్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు సరికాదు

మాక్లూర్: శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న రైతులపై కేంద్రం కాల్పులు జరుపటం సరైంది కాదని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు. ఆదివారం మండలంలోని మాణిక్‌బండార్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వాలని హర్యానా, ఢిల్లీ సరిహద్దులో నిరసన తెలియజేస్తే పోలీసులు కాల్పులు జరిపి రైతు మృతికి కారణమయ్యారని మండిపడ్డారు. రైతు మృతికి కేంద్రం బాధ్యత వహించి బాధిత కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వేణు, గంగారాం, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం



కోటగిరి: కాంగ్రెస్‌లో చేరిన కోటగిరి ఎంపీపీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బీఆర్‌ఎస్ సంబరాలు చేసుకోవడం సబబు కాదని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోల్పోడంతో బీఆర్‌ఎస్ నాయకులకు మతి భ్రమించిందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ, డీసీసీ గెలిగేట్ కొట్టం మనోహర్, మాజీ ఎంపీపీలు గంగాధర్ దేశాయ్, పుప్పాల శంకర్, పవన్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీలు విఠల్, వీరేశం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



ఎడపల్లి: మండలంలోని జాన్కంపేట్‌లో ఉన్న లక్ష్మీనృసింహ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.77,438 వచ్చినట్లు ఆలయ ఈవో వేణు ఆదివారం తెలిపారు. ఆలయ ఉత్సవాలో ఈ నెల 20 నుంచి ఆదివారం వరకు కొనసాగినట్లు పేర్కొన్నారు.

మొరం పంచాయితీ!

- వరద కాలువ మొరంపై రెండు శాఖల మధ్య సమన్వయ లోపం
- ఇరిగేషన్ అధికారుల అనుమతి
- రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ
- గందర గోళంగా మారిన వైనం

బాల్కొండ: వరద కాలువ ఆనకట్ట నుంచి మొరం తవ్వకం పంచాయితీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య కొంత కాలంగా రగులుతోంది. ఎస్సారెస్పీ నుంచి మిగులు జలాలను సద్వినియోగ పర్చేందుకు ముప్కాల్ మండల శివారులో తవ్వకాలు చేపట్టారు. వరద కాలువ తవ్వకాల్లో భారీ మొత్తంలో మొరం వెళ్లింది. దీంతో జీరో పాయింట్ నుంచి వరద కాలువ వెంబడి గుట్టగుట్టలుగా కుప్పలు పోశారు. ఆ మొరానికి ఇన్నాళ్లుగా ఇరిగేషన్ అధికారులు అనుమతులిస్తు ప్రభుత్వానికి డీడీ రూపంలో రుసుం చెల్లిస్తున్నారు. కానీ కొన్నాళ్లుగా మొరం దందా విచ్చల విడిగా సాగడంతో రెవెన్యూ అధికారులు సైతం తమకు తోచిన విధంగా అనుమతులిచ్చారు. ఇలా రెండు శాఖ మధ్య కొంత కాలంగా సమన్వయ లోపంతో సమస్య నలుగుతూ వచ్చింది. గత 15 రోజుల క్రితం వరద కాలువ ద్వారా మొరం తవ్వకాలు చేపట్టడంతో రెండు శాఖల అధికారుల మధ్య ఉన్న సమస్య ఒక్క సారిగా బయట పడింది.



వరద కాలువ నుంచి మొరం తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

దీంతో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సమస్యను సీరియస్‌గా తీసుకుని అనుమతులు ఇవ్వొద్దని సూచించారు. దీంతో ఇరిగేషన్ అధికరాలు అనుమతులు ఇవ్వలేదు. కానీ మధ్యలో రెవెన్యూ అధికారుల(ఆర్డీవో) అనుమతితో మొరం తవ్వకాలు చేపట్టాలని సూచన ప్రాయంగా సూచించడంతో ఇరిగేషన్ అధికారులు అంతాగా పట్టించుకోలేదు. కానీ కాలువ మొరం ఇరిగేషన్ శాఖకు సంబంధించినది అయితే రెవెన్యూ అధికారుల పెత్తనం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి మళ్లీ ఇరిగేషన్ శాఖ అధికారులే అనుమతులివ్వాలి.. కానీ రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. దీంతో ఇరిగేషన్ అధికారుల అనుమతి.. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ చేపట్టాలని నిబంధనాలు వచ్చినట్లు సమాచారం. ఒకరు అనుమతి.. మరొకరు పర్యవేక్షణ ఉంటే ఎలా సమన్వయం చేస్తారనేది ప్రశ్నగా మారింది. దీంతో నిబంధనలు వచ్చినా ఇరిగేషన్ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. అనుమతితో అక్రమ దందా చేపట్టడానికి మాత్రం మొరం మాఫీయా తమ ప్రయాత్నాలను ముమ్మరం చేస్తున్నారు. మొరం అంటే రెండు శాఖల అధికారులకు బంగారు కొండగా మారిందనేది జగమెరిగిన సత్యం. కానీ సామాన్యులు మాత్రం ఇంటి నిర్మాణంలో పునాదులు నింపుకోవడానికి మొరం కోసం నానా తంటాలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మొరం పంచాయితీని పరిష్కరించాలని ఇళ్లు నిర్మించుకునే పేదవారు కోరుతున్నారు.

అనుమతులు ఇస్తాం..

వరద కాలువ ఆనకట్ట నుంచి మొరం తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ నుంచే అనుమతులు ఇస్తాం. కానీ మొరం తరలించే సమయంలో పర్యవేక్షణ కోసం రెవెన్యూ అధికారుల సహాయం తీసుకోవాలని ఉన్నత అధికారులు సూచించారు. సమన్వయంతో మొరం అనుమతులను అందిస్తాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

నెరవేరనున్న కల

- నేడు బోధన్‌లో రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

బోధన్‌టౌన్: పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ఉన్న రైల్వే గేట్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్న పట్టణ ప్రజల కల నెరవేరబోతుంది. ఏళ్ల తరబడి పట్టణ ప్రజలు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. బోధన్ డివిజన్ కేంద్రానికి ప్రతీ రోజు మూడు రైళ్లరాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో బారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాల తాకిడీ ఎక్కువగా ఉంటుంది. ఎట్టకేలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రెండు దశాబ్దాలుగా..

గడిచిన 20 ఏళ్లలో ఎంపీలు మారినా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం మాత్రం నిర్మించ బడలేదు. అనేక మంది మాజీ ఎంపీలతో పాటు రైల్వే జీఎమ్‌లకు విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు, ప్రజలు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఏడాది క్రితం నవీపేట్, ఎడపల్లి, బోధన్‌కు రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు నిధులు మంజూరు అయ్యాయని, రైల్వే అధికారులు పట్టణంలోని గాంధీ పార్కు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న రైల్వే గేట్ వద్ద మట్టి నమూన పరీక్షలు నిర్వహించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద 500 రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 500 కోట్ల నిధులను కేటాయించగా అందులో రాష్ట్రంలోని 400 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు ఉన్నాయి. అందులో బోధన్ ఒకటి. నిర్మాణ పనులను వేగవంతం చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ అర్వింద్ (ఫైల్)

మత్స్యకారులను ఆదుకోవాలి

బాల్కొండ: ఎస్సారెస్పీలో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్య సహకార సంఘం బాల్కొండ అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఉట్నూర్ గణేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రాజెక్టులో చేపలు వేటాడుతున్న మత్స్యకారులు చేపల వేటలో నైపుణ్యం లేక ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. నెల రోజుల వ్యవధిలో ముగ్గురు మత్స్యకారులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల వేటపై శిక్షణ ఇవ్వాలని కోరారు. లైఫ్ జాకెట్లు, మర బోట్లను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. ప్రమాదాల్లో మృతి చెందే మత్స్యకారుల కుటుంబాలకు రూ. 5 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా పెంచాలన్నారు. వరద కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు జాలి గేట్లు లేక పోవడంతో చేప పిల్లలు కాలువలో పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రాజెక్టులో చేపలు ఖాళీ అవుతున్నాయన్నారు. వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ గేట్లకు వెంటనే జాలి గేట్లు బిగించాలని కోరారు. సమావేశంలో మత్స్యసహకార సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

నలందలో రాష్ట్ర స్థాయి పరీక్షలు



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న నలంద హైస్కూల్‌లో ఆదివారం హైదరబాద్‌కు చెందిన ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాష్ట్ర స్థాయి పరీక్ష నిర్వహించారు. పరీక్షకు వివిధ జిల్లాలకు చెందిన మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు 300 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో నలంద పాఠశాల యాజమాన్యం నలంద ప్రసాద్, నలంద సాగర్, ఐఐటీ ఉపాధ్యాయులు అక్షయ్, హనుమాండ్లు, ప్రవీణ్, సందీప్, మౌనిక, వాసవి, అలీనా తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే భవిష్యత్తుకు పునాది

ఆర్మూర్‌టౌన్: ఉన్నతమైన చదువు భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ గవర్నర్ హనుమంత్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లోని విద్యానగర్ కాలనీలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ వారి సౌజన్యంతో పలువురు గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉన్న విద్యార్థినులకు ప్రతి ఏడాది రోటరీ క్లబ్ నార్త్ వారి ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారీ గోపికృష్ణ, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి పట్వారీ తులసి, పద్మ మురళి, విజయసారథి, చరణ్ రెడ్డి, పుష్కర్ రావు, లింగాగౌడ్, విద్యార్థినులు పాల్గొన్నారు.



సైకిళ్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నియోజకవర్గంలో 4 వేల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

వర్ని(మోస్రా): బాన్సువాడ నియోజకవర్గంలో తన హయాంలో 400 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మోస్రా మండల కేంద్రంలో రెడ్డి ఫంక్షన్ హాల్‌ను ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ అవసరాల కోసం కొందరు నాయకులు పార్టీలు మారుతున్నారని వారితో పార్టీకి జరిగే నష్టం ఏమీ లేదని అన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎక్కడైనా లోపాలు జరిగితే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడతానని వెల్లడించారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌కు మంచి రోజులు వస్తాయని కార్యకర్తలు పార్టీని వీడి వెళ్లిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, మోస్రా ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్ అన్నారు. పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మలను, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, ఉపాధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, కార్యదర్శులు కొంతం రాజు, ఎల్.సాయన్న, మంచిర్యాల కిషన్ రాజ్‌కుమార్, ఎస్సారెస్పీ డీఈ గణేశ్, ఎర్ర భూమయ్య, ఎల్‌టీ కుమార్, మారుతి, బాలు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



‘కృష్ణవేణి’లో వీడ్కోలు పార్టీ



బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలపై భయం వీడి బాగా రాయాల ని సూచించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన రైతుల ఆందోళన

వేల్పూర్: మండలంలోని పడగల్ ఒడ్డెరకాలనీ, అంక్సాపూర్ గ్రామాల మీదుగా నిర్మించతలపెట్టిన 63 నంబరు జాతీయ రహదారి బైపాస్‌రోడ్డు నిర్మాణాన్ని ఆపేయాలని రైతులు చేపట్టిన ఆందోళన ఆదివారం కొనసాగింది. ప్రస్తుతం ఉన్న జాతీయరహదారినే విస్తరించాలని పడగల్ ఒడ్డెర కాలనీ, అంక్సాపూర్, కుకునూర్ గ్రామాల జీపీ తీర్మానాలు హైవే అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్‌రోడ్డు కోసం ప్రతిపాదించిన పంటభూమిలో టెంటు వేసి వంటావార్పు నిర్వహించారు. బైపాస్‌రోడ్డు నిర్మిస్తే 70 ఎకరాలు నష్టపోతామని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బైపాస్‌రోడ్డు నిర్మాణాన్ని ఆపేయాలని వారు డిమాండ్ చేశారు.



కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మాణికేశ్వర్‌రావుకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే

నవీపేట: మండలంలోని తుంగిని, నిజాంపూర్ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో వీరు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీజేపీ జిల్లా నాయకులు మాణికేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మనోహర్‌రావు, పలువురు ఉన్నారు.



ఎమ్మెల్యేతో సాటాపూర్ నాయకులు

సాటాపూర్ బీఆర్‌ఎస్ నాయకులు..

రెంజల్: మండలంలోని సాటాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో వీరు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు హాజీఖాన్, రహమత్, సర్దార్, పలువురు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు జావిద్, అంతరెడ్డి రాజారెడ్డి, గయాసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో ఉన్న అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఆలయంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు కుమార స్వామి వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి విగ్రహాలను పల్లకిలో ఉంచి పల్లకి సేవ చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శాంతిపాఠం, ద్వారతోరణ ధ్వజకుంభ ఆరాధన, మూర్తికుంభ ఆరాధన, అరుణహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ అమృతలత, ప్రభదేవి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థం

ఎడపల్లి: జాన్కంపేట్ గ్రామంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చక్రతీర్థం నిర్వహించారు. ఆలయంలో పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేపట్టారు.

బోనాల సంబురాలు



నవీపేట: మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు నిర్వహించిన బోనాల పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు బోనాలను ఊరేగించి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. డీజే పాటలకు యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

అనుమతులు లేకుండా నిర్మాణం



మామిడిపల్లిలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణం

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి పాత జీపీ కార్యాలయ సమీపంలో గ్రామానికి చెందిన కొందరు మున్సిపల్ అనుమతులు లేకుండా ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. మామిడిపల్లి గ్రామం ఆర్మూర్ మున్సిపాలిటీలో విలీనం కావడంతో పాత జీపీ కార్యాలయాన్ని మున్సిపల్ అవసరాలకు వాడుకుంటున్నారు. మున్సిపల్‌కు సంబంధించిన వాహనాలతో పాటు సిబ్బంది నిత్యం కార్యాలయానికి వస్తుంటారు. కాగా కార్యాలయానికి ఆనుకుని నిర్మాణం చేపడుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే అభివృద్ధికి కేటాయించిన పది శాతం స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ స్థలా లు, మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించిన పది శాతం స్థలాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	క్రాక్-జీతేగా తో జీయేగా (హిందీ) - 10.10, 3.40, 9.45 తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి (తెలుగు) - 1.30 సుందరం మాస్టర్ (తెలుగు) - 7.01
స్క్రీన్-2 –	భ్రమ యుగం (తెలుగు) - 12.00, 9.10 సిద్ధార్థరాయ్ (తెలుగు)-3.00 ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 6.10
స్క్రీన్-3 –	ఆర్టికల్-370 (హిందీ) - 1.00, 7.10, 10.35 సుందరం మాస్టర్(తెలుగు) - 4.25
స్క్రీన్-4 –	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05 మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా - 1.50, హనుమాన్(తెలుగు)-06.50 సుందరం మాస్టర్ (తెలుగు) - 10.10

పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేస్తా

ఆర్మూర్‌టౌన్: పద్మశాలీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానాని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పద్మశాలి సంఘం సభ్యులు నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు బిజ్జు దత్తాత్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ధర్మపురిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంబల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఘనపురం సంతోష్‌కుమార్, కోశాధికారి కొక్కుల రవీందర్, ఉపాధ్యక్షుడు బత్తుల భాస్కర్, తర్ప అధ్యక్షుడు బండి అనంతరావు, రుద్ర రాజేశ్వర్, సదమస్తుల గణపతి, ఏలిగేటి చక్రధర్, గుద్దేటి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



దత్తాత్రిని సన్మానిస్తున్న సభ్యులు

ఏసీపీ సేవలు మరువలేనివి



ఏసీపీ కిరణ్‌కుమార్‌తో సభ్యులు

బోధన్‌టౌన్: బోధన్ ఏసీపీగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న కిరణ్‌కుమార్ సేవలు మరువ లేనివని హ్యూమన్ రైట్స్ ఫోరం జిల్లా చైర్మన్ జ్యోతిరాజ్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ప్రజలతో సఖ్యతగా ఉంటు, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా విధులు నిర్వహించారన్నారు. ఏసీపీని ఘనంగా సన్మానించారు. నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫోరం సభ్యులు ఉన్నారు.